కథ

# నిష్కామ క(ష)ర్మ

భావరాజు.వి.యస్

ఆరోజు నాంపల్లి స్టేషన్‌లో గోదావరి ఎక్స్‌ప్రెస్‌లోంచి లలిత దిగింది. ఆరోజు ఏదో బంద్ కారణంగా ఆటోలు బస్సులు లేవు.

ఉస్సూరుమంటూ అటూ ఇటూ చూసింది. కనీసం రిక్షాలేమేనా కనిపిస్తాయేమోనని. కనుచూపుమేరలో అలాంటివేమీ కనిపించలేదు.

ఇంక వేరే గత్యంతరం లేక ఆ బరువైన సూట్‌కేస్‌ని పట్టుకుని విజయనగర్ కాలనీవైపు నడవడం మొదలెట్టింది.

లలిత పదడుగులు వేసిందో లేదో సుబ్బారావు కంటపడింది.

సుబ్బారావు స్త్రీలు కష్టపడితే చూడలేడు. చిన్నప్పట్నించీ అంతే..మాట్లాడితే నిష్కామకర్మ పరోపకారమిదం శరీరం అంటాడు. ముఖ్యంగా ఆడవాళ్ళంటే ఎంతకైనా తెగించి, ఒళ్ళు దాచుకోకుండా సేవచేస్తాడు. చిన్నప్పుడు వాళ్ళ పక్కింటి బామ్మగారు వడియాలు పోసి ఎండలో పెట్టినప్పుడు, ఆ వడియాలు కాకులెత్తుకుపోకుండా, పొద్దున్నించీ సాయంకాలం దాకా కాపలా కాసేవాడు. అంత నిస్వార్థ బుద్ధి అతనిది.

సరే.

ఇప్పుడు లలిత చెమటలు కక్కుకుంటూ, అంత బరువైన సూట్‌కేస్‌ని మోయలేక ఈడ్చుకుంటూ, రోడ్డుకి ఒక పక్కని పెట్టి పెట్టుకుని అందిమీద కూర్చుంది ఆయాసపడ్తూ. చెమటలు తుడుచుకుంటూ, రిక్షాలేమైనా కనిపిస్తాయేమోనని అటు ఇటు చూస్తూ, 'ఈ హైడ్రాబేడ్ ఎప్పుడూ ఇంతే. ఏరోజు ఏ బంద్ ఉంటుందో తెలిసి చావదు' అని విసుక్కుంటూ.

నిజంగా లలితకి సాయం చేసే ఉద్దేశ్యంతోటే దగ్గరకెళ్ళాడు. పెదవులు రెండు చెవులకి తగిలేలా సాగ దీసుకుని సుబ్బారావు నవ్వుమొహం పెట్టి ''ఈ సూట్ కేస్‌ని నేను మోసుకురానా?'' అని అడిగాడు ముందు ఎలాగోలా పలకరించాలని.

''ఎంత కావాలి?'' సాయం దొరికాడు అని మనసులో సంతోషిస్తూ. ఏదో వారాలు చేసుకుంటూ, ఇలా చిన్న చిన్న పనులు చేసుకుని చదువుకునే అబ్బాయనుకుంటూ.

''అబ్బే ఉత్తినేనండి. మీకు సాయం చేద్దామని'' అన్నాడు ఇకిలిస్తూ, చేతులూపుకుంటూ.

''వీడేమో పెద్దమనిషిలా కనిపించే దొంగేమో? నమ్మదగ్గవాడు కాదేమో'' అని అనుకుంది అతనికేసి అనుమానంగా చూస్తూ. అయినా మోసుకొస్తానని సరదా పడుతున్నాడు. మోసుకురానీ, అంత బరువున్న సూట్‌కేస్‌తో ఎలాగా పరిగెత్తలేడు అని అనుకుంటూ.

''ఎక్కడికి వెళ్ళాలి మేడం?'' అడిగాడు సుబ్బారావు.

''విజయనగర్ కాలనీ, గంగా కాంప్లెక్స్‌కి వెళ్ళాలి''

ఇద్దరూ గంగా కాంప్లెక్స్‌కి చేరారు. అలిసిపోయి, చెమటలు తుడుచుకుంటున్న సుబ్బారావుని చూసి ''అలా ఆగిపోయారేం? ఈ బిల్డింగ్‌లో ఐదో అంతస్థులో ఫ్లాట్ నెం.506కి వెళ్ళాలి'' అంది. అంత బరువు సూట్‌కేస్‌ని నెత్తిమీద పెట్టుకుని లిఫ్ట్ దగ్గరకెళ్ళాడు సుబ్బారావు.

''కరెంట్ లేదటండీ. పైకి మెట్ల మీద నుంచి నడిచి వెళ్ళాలి. ఈ శనిగాడు ఎప్పుడు జనరేటర్ పెడ్తాడో'' అని



బిల్డర్ని తిట్టుకుంటూ పాలోమని 5 ఫ్లోర్లు నడుచుకుంటూ ఎక్కి ఫ్లాట్ నెం.506 దగ్గరికొచ్చేరు.

తలుపు తాళాలు తీసి, పెట్టి నందుకుని ''లోపలికి రండి. ఇదే మా ఫ్లాట్. కాఫీ తాగి వెళ్ళురుగాని. బాగా అలిసిపోయుంటారు'' అంది లలిత.

''అబ్బే అదేం లేదండి. మీకు సాయం చేయడం అంటే అలసటనేది అస్సలు అనిపించదండీ. అయినా ఉపకారం చేయడమంటే నాకు సరదా'' అని పైకి అని, ఉస్సూరుమంటూ అక్కడున్న వాలు కుర్చీలో కూలబడ్డాడు. లలిత సూట్‌కేస్‌ని లోపల పెట్టుకుని వంటింట్లోకి వెళ్ళింది కాఫీ చెయ్యడానికి.

ఇంతలోకి ''ఇదే 509. అదిగో వాడే ఐయ్యుంటాడు'' అంటూ తలుపులు తోసుకుని, ఇద్దరు గూండాలలాంటి వాళ్ళు వచ్చి, ఒకడు సుబ్బారావుని కాలరెత్తి పట్టుకున్నాడు.

''నువ్వేనన్నమాట'' అరిచాడు కోపంగా చూస్తూ.

''అవును గురూ! ఆయన అనుమానించింది నిజమే!'' అన్నాడు రెండవవాడు.

''మళ్లీ ఈ చుట్టుప్రక్కల రాకుండా నాలుగు తగిలిద్దాం'' అంటూ ఎంత చెప్పినా వినకుండా సుబ్బారావుని కిందపడేసి, సున్నంలోకి ఎముకలు లేకుండా కొట్టేరు.

ఈ గొడవ విని లలిత వంటింట్లోనించి బయటికొచ్చి ''ఎవరు మీరు? ఏంటిలా వచ్చేరు మర్యాద లేకుండా?'' అంది కోపంగా చేతులు తుడుచుకుంటూ.

''చూడమ్మా. ఏమీ తెలీనట్లు నటించకు. మీ ఆయనే మమ్మల్ని ఇక్కడికి పంపించాడు. ఆయన ఆఫీస్‌కి వెళ్ళగానే ఈయన మీతో సాగించే రాసక్రీడల్ని గురించి మీ ఆయనే, మమ్మల్ని కనిపెట్టి, వీడు మళ్లీ ఇటువైపు రాకుండా ఉండేలా దేహశుద్ధి చేయమన్నాడు..చేశాం.''

''ఏంటి మీరు మాట్లాడేది? నాకింకా పెళ్లే కాలేదు.''

''పెళ్ళే కాలేదా?!!!''

''మరి మీ ఆయన?!!!''

''ఆయనేంటి ఆయన? మీరేదైనా పిచ్చాసుపత్రి నించి తప్పించుకొచ్చేరా?''

''మరి ఈయనెవరు? మీరు బతిమాలి రమ్మంటే జాలిపడి వచ్చానంటున్నాడు?''

నేలమీద పడి మూలుగుతున్న సుబ్బారావుని చూపిస్తూ అడిగాడు పెద్ద గూండాగారు, కొంచెం అనుమానంతో భయపడుతూ.

''అదంతా మీకు అనవసరం. ఇంతకీ మీకెవరిల్లు కావాలి?''

''ఇది 509 కాదా?'' భయపడుతూ అడిగాడు గూండాగారి శిష్యుడు.

''కాదు ఇది 506'' అంది లలిత కోపంగా.

మరి బయట ఇత్తడి అంకెలు 509 అని ఉన్నాయి.

''ఓ అదా? ఇత్తడి అంకెలు బాగున్నాయి కదా అని పెట్టించా. కానీ '6' అంకెపై ఉన్న 'స్క్రూ' పడిపోయి '6' తల్లకిందులై 509లా ఉందిలాగుంది. బాగుచేయించాలి'' అంది లలిత మామూలు ధోరణిలో.

గూండాలు కటుక్కున నాలిక కరుచుకుని చల్లగా బయటకి జారుకున్నారు.

మూలుక్కుంటూ ఒక చెయ్యి నడుముమీద, ఒక చెయ్యి మోకాలు మీద పెట్టుకుని ''ఇంక జన్మలో ఛస్తే ఎవరికీ ఉపకారం చేయకూడదు'' అని గొణుక్కుంటూ పైకి లేవడానికి ప్రయత్నించాడు సుబ్బారావు, దెబ్బలు, బొప్పిలు తడుముకుంటూ.

★